

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన కూకట్‌పల్లి వెస్ట్రన్ హిల్స్‌కు చెందిన రాలీ భానుమూర్తి కుటుంబం రూ.లక్ష విరాళంగా ఇచ్చింది.



24న జగన్నాథ రథయాత్ర

పాత గుంటూరు: గుంటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నగరంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు వుండరీక గోవిందదాస్ తెలిపారు.



ఆదాయం రూ. 17.76లక్షలు

గంపలగూడెం: నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.17.76, 939 ఆదాయం వచ్చినట్లు దేవదాయ సహాయ కమిషర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో నేడు యోగా దినోత్సవం

నరసరావుపేటటౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ప్రతి రోజూ యోగా చేయటం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. నిర్వహించే కార్యక్రమంలో యోగా గురువుచే అవగాహన, యోగాసనాలు చేసే విధానాలు వివరిస్తారన్నారు.

యార్డుకు 46,973 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 46,973 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,569 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,700 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.13,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ. 24,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,755 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల పీటీఐల బదిలీ ప్రక్రియ

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలోని 28 మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ) బదిలీ ప్రక్రియను చేపడుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈనెల 23వతేదీలోగా ఇన్‌స్ట్రక్టర్స్ తమ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. 24న దరఖాస్తుల పరిశీలన, సీనియారిటీ జాబితా ప్రకటన, 26 అభ్యంతరాల స్వీకరణ, 27 సీనియారిటీ తుది జాబితాను ప్రకటించి 28వతేదిన కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు అందిస్తామని వివరించారు. వివరాలకు అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు (9885729545)ను సంప్రదించాలని తెలిపారు.

వైద్య సిబ్బంది బదిలీ కౌన్సెలింగ్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల (ఆర్డీ) కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ ఉత్తర్వులు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, రేడియోగ్రాఫర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌లు (ఎస్ఓ), మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లు (ఫీమేల్) అభ్యర్థులకు తొలిరోజు కౌన్సెలింగ్ జరిగింది. స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు, ఫార్మాశిస్టులకు బుధవారం కౌన్సెలింగ్ జరుగనుంది. ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సుధీర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు పాల్, అనిల్, సుబ్బారావు, షరీఫ్ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది. ఇది 33.7181 టీఎంసీలకు సమానం.

కౌలు రైతులకు 'గుర్తింపు'

జిల్లాలో 50,880 మందికి గుర్తింపు కార్డులు

- బ్యాంకు రుణాలు, ఈ–క్రాప్‌నకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెట్టుబడి సాయం
- జూన్ 30లోగా అందరికీ కార్డులు



కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న వ్యవసాయశాఖాధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్ని వర్గాలకు చెందిన రైతులతో పాటు కౌలు రైతులను ఆదుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో ఉన్న కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు అందించి అన్ని పథకాలను వారికి వర్తింపచేయనుంది. దీంతో కౌలు రైతులకు మరింత మేలు జరగనుంది. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 50,880 మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందించి చేయూత అందించాలని ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. అందులో భాగంగా వేమూరు, కొల్లూరు, చుండూరు, భట్టిప్రోలు, అమృతలూరు, రేపల్లె, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, చీరాల, వేటపాలెం, అద్దంకి, జె.పంగులూరు, సంతమాగులూరు, బల్లికురవ, కొరిశపాడు, పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, మార్టూరు మండలాల పరిధిలో 50,880 మంది కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించింది. వీరందరికి గుర్తింపు కార్డులు అందజేయాలని నిర్ణయించింది. జూన్ 30లోపు కార్డుల పంపిణీకి గడువు విధించారు. ఇప్పటివరకు 36,343 మందికి కార్డులు అందజేశారు. మిగిలిన వారికి ఈనెలాఖరులోపు అందజేయనున్నారు.

కౌలు రైతులకు లబ్ధి ఇలా..

గుర్తింపుకార్డులు పొందడం వలన కౌలు రైతులకు మరింత లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా కౌలు రైతులు బ్యాంకు రుణాలు పొందొచ్చు.. సాగుచేసిన పంటలను ఈ క్రాప్ చేయించుకోవచ్చు. దాని వలన మద్దతు ధరతో పంటలను అమ్ముకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 13,500 పెట్టుబడి సాయంగా పొందవచ్చు. కౌలుపత్రం పొందడం ద్వారా ప్రభుత్వం అందించే సాయానికి అర్హత పొందుతారు. పంటరుణాలు, పంటలబీమా ఉపశమనం, పెట్టుబడి రాయితీ లభిస్తుంది. కౌలు రైతుల ఒప్పందపత్రం కాలపరిమితి 11 నెలలు ఉంటుంది.

రైతులకు అవగాహన..

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేపట్టింది. రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో కౌలుదారులు సాగుచేస్తున్న భూమి వివరాలు, ఆధార్ వివరాలు, గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులకు అందజేయాలి. కౌలు రైతుల అర్హత ఆధారంగా పంటలసాగు గుర్తింపుపత్రం అందజేస్తారు.

> **కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు**
>
> 
>
> జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 50,880 మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 36,343 మందికి పత్రాలు అందజేశాం. ఈనెలాఖరులోగా మిగిలిన వారికి గుర్తింపు కార్డులు అందజేస్తాం. గుర్తింపు కార్డుల వలన కౌలురైతులకు వైఎస్సార్ రైతుభరోసాతోపాటు, పలు ప్రయోజనాలు కలుగుతాయి.
>
> – అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్రస్థాయి ద్వితీయ ర్యాంకర్‌కు సీఎం పురస్కారం



ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని సుప్రజ, హెచ్‌ఎం నిర్మల

వలపర్ల విద్యార్థిని పోలిశెట్టి సుప్రజకు రూ.75 వేలు నగదు బహుమతి

మార్టూరు: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 593 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పోలిశెట్టి సుప్రజ మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఏ1 కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ సుప్రజకు రూ.75 వేలు నగదు బహుమతి అందజేసి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం, తెనాలి డివిజన్ డిప్యూటీ డీఈఓ ఎం.నిర్మల, సుప్రజ తల్లిదండ్రులు అంజలి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సహకార సంఘాల కంప్యూటరీకరణకు చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లాస్థాయి సహకార సంఘాల నిర్వహణ, పర్యవేక్షణ కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా రైతులకు అందించడమే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ చెప్పారు. నగదు బదిలీ, రాయితీలు, బీమా వర్తింపజేసే కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతాయన్నారు. ఆయా సంఘాలలో నేటివరకు ఆధునీకరణ సేవలు అందుబాటులోకి రాకపోవడం ఏంటని ఆరా తీశారు. పీడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 68 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నడుస్తున్నాయన్నారు. ఈ సంఘాలలో 42 వేలమంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నట్లు వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటరీకరణ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఆప్కాబ్ ద్వారా కంప్యూటర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. తదుపరి వాటి నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారదర్శకంగా రైతులకు అన్ని సేవలు అందజేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి రామారావు, పీడీసీసీబీ సీఈఓ వై.ప్రకాష్, నాబార్డ్ డీడీఎం శరత్, అప్కాబ్ డీపీడీఎం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు పక్కదారిపై నగర కమిషనర్ సీరియస్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరులో మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి అధికారులు చేయాల్సిన ఆశీల వసూళ్లను ప్రైవేట్ వ్యక్తులు చేయడంపై సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి సీరియస్ అయినట్టు సమాచారం. ఈ విషయంపై బుధవారం రెవెన్యూ అధికారులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. గత మూడు నెలల నుంచి మరుగుదొడ్లు, మార్కెట్ల ద్వారా కార్పొరేషన్‌కు జమ అయిన నగదుకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందో అని రెవెన్యూ అధికారులు భయాందోళనలో ఉన్నారు.

అధికారులను కాపాడే యత్నంలో..!

అధికారులను కాపాడే యత్నంలో ప్రైవేట్ వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత కాలం తమ జేబులు నింపిన అధికారులను ఎలాగైనా కాపాడేందుకు శతవిధాలా యత్నిస్తున్నట్టు సమాచారం. పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తరువాత కూడా ప్రైవేట్ వ్యక్తులే ఆశీలు వసూలు చేసేలా చక్రం తిప్పే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

తోటి కార్మికుల కళ్లెదుటే కాలిబూడిద



సున్నపు బట్టీలో కాలిపోతున్న బ్రహ్మయ్య



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- సున్నపు బట్టీలో పడి కార్మికుడి సజీవదహనం
- సహచర కూలీల హాహాకారాలు
- కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీరుమున్నీరు

పిడుగురాళ్ల: తోటి కార్మికుల కళ్లెదుటే సున్నపు బట్టీలో పడి ఓ కూలి కాలిబూడిదైన హృదయ విదారక ఘటన పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో మంగళవారం జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన రామిశెట్టి చిన్న బ్రహ్మయ్య(40) సున్నపు బట్టీలో పనిచేస్తుంటాడు. రోజూమాదిరే మంగళవారం ఉదయాన్నే బట్టీలో పనికి వెళ్లాడు. సున్నపు రాయిని బట్టీలో వేస్తుండగా ప్రమాదవశాత్తు లోపల పడిపోయాడు. అప్పటికే సున్నపు బట్టీ బాగా వేడిగా, భారీ ఉష్ణోగ్రతతో ఉండటంతో చిన్న బ్రహ్మయ్య కాలి బూడిదయ్యాడు. అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరగడంతో తోటి కార్మికులు బాధతో హాహాకారాలు చేశారు. బట్టీ వద్ద ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ఎవరూ అక్కడకు వెళ్లేందుకు సాహసం చేయలేకపోయారు. సహచర కూలి కాలిబూడిదవుతుంటే కన్నీటిపర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న మృతుడి భార్య వెంకట రమణ, బంధువులు బట్టీ వద్దకు చేరుకుని గుండెలవిసేలా రోదించారు. చినబ్రహ్మయ్యకు భార్య వెంకట రమణతోపాటు, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



రామిశెట్టి చిన్న బ్రహ్మయ్య(ఫైల్)

ముగిసిన ఏపీ క్రీడా పాఠశాలల ప్రవేశానికి ఎంపికలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల నిమిత్తం ఎంపికలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రవీంద్రభవాని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం విద్యార్థులకు పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్ పోటీలను నిర్వహించారు. హాజరైన విద్యార్థుల్లో ముగ్గురు బాలురు ఈ నెల 23, 24 తేదీల్లో గుడివాడలో జరగనున్న జిల్లా స్థాయి ఎంపికలకు అర్హత సాధించినట్లు సెలక్షన్ కమిటీ కన్వీనర్ డి.నాగరాజు తెలిపారు.

కదిలే రైలు ఎక్కబోతుండగా ప్రమాదం

- వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం
- రైలు ఆపి బయటకు తీసిన పోలీసులు, ప్రయాణికులు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మహేంద్ర విష్ణుభగత్

చీరాల రూరల్: మంచినీళ్ల కోసం రైలుదిగిన ప్రయాణికుడు ఆ రైలు కదలడంతో పరుగున వెళ్లి ఎక్కబోతుండగా జారిపడటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఈఘటన మంగళవారం సాయంత్రం చీరాల రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య వివారల మేరకు.. మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన మహేంద్ర విష్ణుభగత్ అనే వ్యక్తి నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. రైలు చీరాల రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ఆగింది. దీంతో భగత్ మంచినీరు తెచ్చుకునేందుకు రైలుదిగాడు. ఈ క్రమంలో రైలు ప్లాట్‌ఫాం నుంచి బయలు దేరడం గమనించిన అతను పరుగున వెళ్లి రైలు ఎక్కే ప్రయత్నం చేశాడు. అయితే అతని రెండు చేతులు పట్టు తప్పడంతో రైలుకు ప్లాట్‌ఫాంకు మధ్యలోకి వెళ్లిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు రైలు చైన్ లాగడంతో పాటు ప్లాట్‌ఫాంపై ఉన్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తక్షణమే స్పందించి లోనికి జారిపోతున్న బాధితుడిని ప్లాట్‌ఫాంపైకి లాగి ప్రాణాలు రక్షించారు. అప్పటికే అతని రెండు చేతులు ప్లాట్‌ఫాంకు రైలుబోగికి మధ్యలో ఇరుక్కుపోవడంతో రెండు చేతులు మణికట్టుల వరకు చర్మం ఊడిపోయి తీవ్ర రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడిని చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరోగ్య 'యోగ'ం

నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంతో ఆరోగ్యయోగం చాలా మందికి అందని ద్రాక్షలా మారింది. మారిన ఆహారపు, నిద్ర, ఇతరత్రా అలవాట్లతో ఆరోగ్య పరిరక్షణ కష్టమైంది. చిన్నవయసులోనే దీర్ఘకాలిక రోగాలు, ఊబకాయం బారిన పడటం మనం చూస్తూనే ఉన్నాం. నిద్రలేమి, నిస్సత్తువ, దీర్ఘకాలిక రోగాలు, ఆకలి మందగించడం, ఆందోళన వంటి ఇబ్బందులన్నీ చుట్టుముట్టేస్తున్నాయి. వీటన్నిటికీ ఏకైక పరిష్కారంగా మన ప్రాచీన అభ్యసన నిలుస్తోంది. యోగాతో అనేక మానసిక, శారీరక రుగ్మతలకు చెక్ పెట్టవచ్చని ఇప్పటికే నిరూపితమవగా.. జిల్లాలో సైతం అనేకమంది యోగా దివ్యౌషధ ఫలితాలను చవిచూస్తున్నారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత
- ఆధ్యాత్మిక ఉద్ధరణకు దోహదం
- చీరాలలో డజన్ల కొద్ది యోగా సెంటర్లు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



శివకోటేశ్వరరావు గురూజీ వేసిన ఆసనాలు

చీరాల రూరల్: యోగా ఇప్పుడు విశ్వవ్యాపితం. యోగాతో శారీరక, మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రపంచ దేశాలు సైతం ధ్రువీకరించాయి. యోగా అంటే రుషి సంప్రదాయంతో పుట్టిందని అర్థం. రుషులు ఆచరించి మానవాళికి అందించిన విద్య యోగ. యోగను బ్రహ్మ విద్య అనికూడా పిలుస్తారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఒక గంటపాటు సాధన చేస్తే మంచి ఆరోగ్యం సాధించవచ్చని ప్రముఖ యోగా గురువు సోమరౌతు శివ కోటేశ్వరరావు (గురూజీ) ఘంటా పథంగా చెప్తున్నారు.

చీరాలలో మొట్టమొదటి యోగా గురువు..



చీరాలలో మొట్టమొదటి యోగా గురువుగా సోమరౌతు శివ కోటేశ్వరరావు గుర్తింపు పొందారు. ఆయన తన 16వ ఏటా యోగాను ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన వయస్సు 70 సంవత్సరాలు. 50 ఏళ్లకుపైగా ప్రస్థానంలో ఆయన ఎంతోమందికి యోగా విద్యనేర్పి శిష్యులుగా చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన నేర్పిన యోగాతో చీరాలలో అనేక మంది యోగా గురువులుగా చలామణిలో ఉన్నారు. ఆయన ఇప్పటికీ ఎంతో చలాకీగా, ఎంతో ఆరోగ్యవంతంగా రోటరీ కమ్యూనిటీ హాలులో ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగాలో పట్టణ ప్రజలకు శిక్షణనిస్తున్నారు. బీపీ, షుగరు, ఆస్తమా, ఉబ్బసం, ఆయాసం వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు యోగాసనాలతో ఉపశమనం కలిగిస్తున్నారు.

యోగాతో నిత్య సంతోషం..



సుధాకర్‌రావు వృత్తి రీత్యా బ్యాంకు ఉద్యోగి, కొన్నాళ్లపాటు సాధారణంగానే జీవించాడు. శారీరక రుగ్మతలు, మనఃశ్శాంతి లేకపోవడం వంటి సమస్యలతో సతమతం అయ్యారు. ఈ క్రమంలో ఆయన గత 20 ఏళ్ల క్రితం యోగా బాట పట్టాడు. రామ్‌దేవ్ బాబా వద్ద యోగాలో శిక్షణ పొందాడు. యోగాసనాలు అభ్యాసం చేశాడు. దాంతో మానసిక ప్రశాంత కలిగింది. ఒత్తిడి తగ్గిపోయింది. దాంతో అప్పటి నుంచి అదే మార్గాన్ని పది మందికి చూపుతూ ముందుకు సాగాడు. ఇంట్లో వారితోనూ యోగాభ్యాసం చేయిస్తున్నాడు. ప్రతి రోజూ గంట పాటు ఆసనాలు వేస్తుంటాడు.

84 రకాల యోగాసనాలు..

యోగాసనాలు మొత్తం 84 రకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి 20 వరకు ఉంటాయి. ఆయా ఆసనాలను ఆభ్యసించినట్లయితే నీరసం, నిస్సత్తువ, బీపీ, షుగరు, ఉబ్బసం, ఆస్తమా, ఆయాసం వంటి ఆరోగ్య సమస్యలు మనదరి చేరనే చేరవు.

ముఖ్యమైన ఆసనాలు ..

శీర్షాసనం, సర్వాసనం, పశ్చిమోత్తాసనం, అర్ధమచ్ఛేంద్రాసనం, హలాసనం, భుజంగాసనం, శలభాసనం, ధనురాసనం, యోగముద్రాసనం, చక్రాసనం, వజ్రాసనం, ప్రాణాయామం. జీర్ణశక్తి మెరుగుకోసం అర్ధమోత్తాసనం, యోగ ముద్రాసనాలు ప్రధానమైనవి. ఈ ఆసనాలు అభ్యసించినట్లయితే ఆరోగ్య సమస్యలకు చక్కని పరిష్కార మార్గాలుగా ఉన్నాయని యోగా గురువు పేర్కొంటున్నారు.

200 మందికి రుగ్మతలు తొలిగాయి..



మనిషిని యోగా మానసికంగా, భౌతికంగా ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యక్తి ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి సాధించేందుకు యోగా బాగా ఉపయోగ పడుతుంది. యోగా ప్రయోజనాన్ని తెలుసుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యోగాలో ఎంఫిల్ చేశాను. గత 14 ఏళ్లుగా యోగాలో శిక్షణనిస్తూ ఎన్నో సత్ఫలితాలను సాధించాను. ఇప్పటి వరకు నా ఆధ్వర్యంలో 200 మందికి శారీరకంగా, మానసికంగా ఉన్న రుగ్మతలను పోగొట్టేందుకు దోహద పడింది. షుగర్, బీపీ, శారీరక అనారోగ్యం నుంచి చాలా మంది బయటపడ్డారు.

– వలివేటి వెంకట రామానుజం, యోగ శిక్షకుడు, చినగంజాం

యోగాతో ఎంతో ఆరోగ్యంగా ఉన్నా..



నేను బీపీ, షుగర్, గ్యాస్ట్రబుల్ ఇతర శారీరక సమస్యలతో బాధపడుతుండేవాడిని. యోగా గురించి తెలుసుకొని గత తొమ్మిదేళ్లుగా సాధన చేస్తున్నాను. ముందు శరీరం సహకరించక కొంత ఇబ్బందిగా అనిపించినా ఇప్పుడు బాగా అలవాటు పడ్డాను. బీపీ, షుగర్‌కు గతంలో బిళ్లలు వాడే వాడిని, వాటిని పక్కన పెట్టాను. ప్రతి రోజు ఉదయం యోగా చేస్తూ సాయంత్రం వాకింగ్ చేస్తున్నాను. నాలో ఉన్న అన్ని రోగాలు కన్పించకుండా పోయాయి. ఇప్పుడు నేను ఆరోగ్యంగా, ఎంతోహాయిగా జీవిస్తున్నాను.

– నందు శ్రీనివాసరావు, చినగంజాం

సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్

కారంచేడు: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పనితీరును మరింత మెరుగుపరచుకోవాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారంచేడు-3 సచివాలయాన్ని మొదట సదర్శించారు. అందుబాటులో ఉన్న అన్ని శాఖల సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో జరగనున్న జగనన్న సురక్ష పథకాన్ని ఏవిధంగా అమలు చెయ్యాలనే విధానంపై ఆరా తీశారు. ఏఎన్ఎంలు మీ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు అవసరమైన అన్ని రకాల సేవలు క్రమం తప్పకుండా అందించాలన్నారు. ముఖ్యంగా ఎనీమియాతో బాధపడే గర్భిణులు, చిన్నారులపై పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. పిల్లల బరువును క్రమంగా పెంచేందుకు కృషి చెయ్యాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌లపై సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను పెట్టాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది తీరుపై


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

ఆయన సమీక్షించారు. తహసీల్దారు ఎస్.వెంకటరత్నం, ఈఓపీఆర్డీ ఆర్.రమేష్‌బాబు, డీటీ సుశీల, ఏఓ సు. దీర్‌బాబు, గ్రామ కార్యదర్శి అంజయ్య, అన్ని శాఖల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ పరిశీలన..

చీరాల: మండలంలోని ఈపూరుపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీని పరిశీలించారు. అలానే పాఠశాలలో నాడు-నేడు పనులను ఆయన పరిశీలించి వివరాలను పాఠశాల సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. అలానే మండలంలోని గవినివారిపాలెంలోని సర్వే నెంబర్ 214-4లోని భూమిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ పి.సరోజిని, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, సిబ్బంది ఉన్నారు.

నవభారతం యువతతో సాధ్యం

- ఆర్డీఓ గంధం రవీందర్
- బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా ముగిసిన యువఉత్సవ్ - 2023

బాపట్ల అర్బన్: నవ భారతం యువతతోనే సాధ్యమని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ అన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్రం, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ ఉత్సవ్ - 23' బాపట్ల ఇంజినీరింగ్ కాలేజ్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యువతకు 'అమ్రిత్‌కాల్ పంచ్ ప్రాణ్' అనే థీమ్‌తో పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆర్డీఓ రవీందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ భవిత యువత చేతుల్లోనే ఉందన్నారు. క్రమ శిక్షణతో విద్యనభ్యసించి మంచి మార్గాన్ని ఎన్నుకోవడం ద్వారా భారత దేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చని పేర్కొన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ప్రతిభను ప్రదర్శించడానికి యువ ఉత్సవాలు చక్కటి వేదికలుగా నిలుస్తాయన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కాలేజ్ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి, ఉత్తేజం నింపటానికి యువ ఉత్సవాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఉత్సవ్‌లో పాల్గొన్న యువతను ఆయన అభినందించారు. సమాచార శాఖ ఉమ్మడి గుంటూరు, కృష్ణా క్షేత్ర ప్రచార అధికారి ఆర్.రమేష్ చంద్ర, బీఈసీ వైస్ ప్రెసిడెంట్ -1 డి.రామ్మోహన రావు, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, బీఈసీ ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఘంటా సుధాకర్, అసోసియేట్ డీన్ స్టూడెంట్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.నిరంజన్ బాబు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా ఉత్సవ్‌లో పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అతిథులు విజేతలకు నగదు బహుమతులు, షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేశారు. సీబీసీ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీస్, స్థానిక ఎన్జీఓలు, కార్ప్స్, గ్రామీణ వికాస ఫౌండేషన్ ఏర్పాటు చేసిన హ్యాండ్లూం స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ గంధం రవీందర్, ముప్పలనేని శ్రీనివాసరావు

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్

మార్టూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా సమస్యలను పరిష్కరించాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య భవనం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండలంలోని ఉద్యోగులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాలవారీగా ఇంటింటికి తిరిగి, సమస్యలను గుర్తించి సచివాలయాల్లో ఏర్పాటు చేసే హెల్ప్ డెస్క్‌ల ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మొదలు మ్యుటేషన్ తదితర ప్రజలకు అత్యంత అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్ష పథకం ద్వారా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తహసీల్దార్ బి.వెంకటరెడ్డి, డీఎల్‌డీఓ సువార్తమ్మ, ఎంపీడీఓ కె.కృష్ణకుమారి, ఎంఈఓ వస్రాంనాయక్, మార్టూరు, యద్దనపూడి మండలాల రెవెన్యూ, సచివాలయ, పంచాయతీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మార్టూరులో కలెక్టర్ పర్యటన..

బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా నేడు మార్టూరులో పర్యటించనున్నట్లు తహసీల్దార్ బి.వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక గన్నవరం రోడ్డులోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించి మార్టూరులోని సచివాలయం, ఒక ఆర్బీకే సెంటర్‌ను పరిశీలించిన అనంతరం ఇసుకదరిశి గ్రామంలో నాడు నేడు పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలిస్తారని తహసీల్దార్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


స్టేషన్‌లో ఉన్న ప్రేమజంట

యద్దనపూడి: కులాలు వేరుకావడంతో ఇంట్లో పెద్దలు ఒప్పుకోరేమోనని భయంతో ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. ఇరుకుటుంబాల పెద్దలను పిలిచి వారి సమక్షంలో ప్రేమికులకు పెళ్లి చేసిన ఘటన యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన పఠాన్‌బాజీ, చింతపల్లిపాడు గ్రామానికి చెందిన సంధ్యారాణి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరు మేజర్లు కావటంతో పోలీసులు ఇరు కుటుంబాల సభ్యులను పిలిపించి, వారిని ఒప్పించి ప్రేమజంటకు వివాహం జరిపించారు. కలిసిమెలిసి ఉండాలని ఇరువర్గాల బంధువులు, పోలీసులు నూతన జంటను ఆశీర్వదించారు. ఎస్‌ఐ అనూక్, ఏఎస్‌ఐ శేషసాయి, గన్నవరం మాజీ సర్పంచ్ నల్లపునేని రంగయ్య పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ సెల్‌కు మంచి స్పందన

నరసరావుపేట: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎడ్యుకేషనల్ సెల్‌ను 55మంది వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి వారం రోజులపాటు విద్యార్థులకు పైచదువులు చదువుకునే అవసరమైన సమాచారాన్ని అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించే విధంగా 'ఎడ్యుకేషన్ సెల్' ప్రారంభించారు. మంగళవారం నాటికి సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి 38 మంది విద్యార్థులు, జిల్లా విద్యాశాఖకు చెందిన 16 మంది, వెనుకబడిన తరగతుల శాఖకు సంబంధించి ఒకరు తమ సమస్యలు నివృత్తి చేసుకొన్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న, అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ నుంచి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం, బాపట్లలో ఖాళీగా ఉన్న ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ (ఉర్దూ), అసిస్టెంట్ జీసీడీఓ, అసిస్టెంట్ సీఎంఓ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు మంగళవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్ అఫీషియో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష, బాపట్ల కార్యాలయంలో అందజేయాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునేవారు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, ఇతర వివరాలకు సంబంధిత ఉపవిద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారుల కార్యాలయంలో కార్యాలయపు పనివేళల్లో సంప్రదించాలన్నారు.

పోషకులకు వరం.. పశుబీమా పథకం

చీరాల అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న పశుబీమా పథకాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైకుంఠపురంలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పశుబీమాపై పశు వైద్యాధికారులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలకు 80 శాతం సబ్సిడీతో ఈ పథకం వర్తిస్తుందన్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకోవచ్చన్నారు. గేదెలు, ఆవులకు మూడేళ్లకుగాను బీమా చేసుకోవడానికి రూ.364, గొర్రెలకు ఒకటికి రూ.36 ఏడాదికి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. పశుబీమా పథకంతో పాటు పశుసంవర్ధకశాఖ ద్వారా రాయితీతో ఇచ్చే సంపూర్ణ మిశ్రమ దాణా, పశు గ్రాస విత్తనాల పంపిణీ గురించి వివరించారు. చీరాల ప్రాంత సహాయ సంచాలకుడు డాక్టర్ చిట్టిబాబు, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి హనుమంతరావు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు

చెరుకుపల్లి: ప్రతి మహిళ వ్యాపార వేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు అన్నారు. స్థానిక శ్రీశక్తి భవన్‌లో వైఎస్సార్ క్రాంతి పథం కార్యక్రమంలో భాగంగా రుణమేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుటుంబంలో మహిళల భాగస్వామ్యం పెంపొందించే దిశగా ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లవారిపాలెం, కనగాల, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి, రాజవోలు, తూర్పుపాలెం, ఆరేపల్లి, గుళ్లపల్లి సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు, పలు శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు మహిళలకు రుణమేళా..

మండలంలోని శ్రీశక్తి భవన్‌లో బుధవారం చెరుకుపల్లి, ఆరుంబాక, బలుసులపాలెం, కావూరు, తుమ్మలపాలెం, రాంబొట్లపాలెం గ్రామాల్లోని మహిళలు రుణమేళ కార్యక్రమంలో పాల్గొనాలని ఏపీఎం వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

మోదీ ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో దేశం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

చీరాల రూరల్: దేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో చీరాలలో మంగళవారం రాత్రి బహిరంగ ఏర్పాటు చేశారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రపంచ దేశాలు అతలాకుతలం అవుతుంటే ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో మన దేశ ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. దేశ ప్రజలందరి ఆరోగ్యం కోసం 230 కోట్ల మందికి ఉచితంగా వ్యాక్సిన్‌లు వేయించి, ప్రపంచ దేశాలకు కూడా అందించారని గుర్తు చేశారు. ఆత్మనిర్భర్ భారత్ పేరుతో 80 కోట్ల మంది దేశ ప్రజలకు ఆహార పదార్థాలు అందించారన్నారు. పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకట రమణారావు అధ్యక్షతన వహించిన ఈ సభలో రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జ్ అడ్డూరి శ్రీరాం, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకున్న చీరాల అభివృద్ధి సాధన సమితి..

బీజేపీ, నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీలు ఏమయ్యాయని, విశాఖ ఉక్కు ఎందుకు ప్రైవేటు పరం చేస్తున్నారంటూ చీరాల అభివృద్ధి సాధన సమితి నాయకులు ఫ్లెక్సీలో పొందుపరచి కాన్షీరాం విగ్రహం ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. మోదీ డౌన్ డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దేశాన్ని బీజేపీ నాయకులు దోచుకుంటున్నారని, కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. దీంతో బీజేపీ కార్యకర్తలు వారిని కొట్టేందుకు దూసుకుపోయారు. సీఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో వచ్చి చీరాల అభివృద్ధి సాధన సమితి నాయకులను పక్కకు తీసుకెళ్లారు.